క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

ఆత్మకూరు: ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆర్డీఓ నాగజ్యోతి ఆదివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయన్నారు. క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. గెలుపు, ఓటములను ఇరు జట్లు సమానంగా తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి మన్సూర్‌బాషా, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్‌వీ రాజు, అంజుమన్ అధ్యక్షుడు నూర్‌బేగ్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు రేడియం నూర్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

బరక సంజీవయ్యకు ప్రత్యేక పూజలు



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

నందికొట్కూరు: మిడుతూరు మండల పరిధిలోని రోళ్లపాడు వద్ద వెలసిన బరక సంజీవయ్య స్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, పల్లకీ సేవ, హోమ కార్యక్రమాలు చేపట్టారు. అలాగే దాత భీమ్‌శెట్టి నరేష్ భక్తుల సౌకర్యార్థం ఆలయానికి ఉచిత బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ప్రతి నెలా అమావాస్య రోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయానికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు అర్చకులు తెలిపారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో కొలువైన ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న పండితులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా విశేషంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు



పైనాపిల్ పండ్ల అలంకరణలో ఆంజనేయస్వామి

ఆత్మకూరు: స్థానిక పాత బస్టాండ్‌లో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారిని పైనాపిల్ పండ్లతో ప్రత్యేక అలంకరించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి మహిళలు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. రాత్రి స్వామివారికి 13 రకాల నక్షత్ర హారతులు ఇచ్చారు. అర్ధరాత్రి మహా మంగళ హారతి కార్యక్రమాన్ని, భజనలు చేశారు.

రేపు మున్సిపల్ సమావేశం



కమిషనర్ బేబి

నందికొట్కూరు: మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని జై కిసాన్ పార్కులో ఈ నెల 29వ తేదీన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనునట్లు కమిషనర్ బేబి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. మున్సిపాలిటీకి చెందిన అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

తమ్మడపల్లె సర్పంచ్ మృతి



సాలమ్మ (ఫైల్)

మహానంది: తమ్మడపల్లె గ్రామ సర్పంచ్ చాబోలు సాలమ్మ(75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుగా ఆమె గెలుపొందింది. సర్పంచ్ చాబోలు సాలమ్మ మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సాలమ్మ మృతి బాధాకరమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా పాలమహేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర

- మండలంలోని 11 సచివాలయాలు ఆరు క్లస్టర్లుగా విభజన
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు





ఒక క్లస్టర్‌గా ఏర్పడనున్న తాటిపాడు, 80బన్నూరు సచివాలయాలు

జూపాడుబంగ్లా: ప్రజలకు వారు ఉంటున్న ఊళ్లోనే ప్రభుత్వ సేవలు అందాలన్న లక్ష్యంతో, గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసి అందులో 11 విభాగాలకు సిబ్బందిని నియమించారు. గ్రామీణ ప్రజలు ఊరుదాటి ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాయాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా ఉన్న ఊర్లోనే వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందేలా చేశారు.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాలపై శీతకన్ను ప్రదర్శిస్తోంది. మండలవ్యాప్తంగా ఉన్న 11 గ్రామ సచివాలయాలను క్లస్టర్లుగా విభజించి రెండు మూడు గ్రామాలకు ఒక సచివాలయం ఉంచేలా పావులు కదుపుతోంది. అందులో భాగంగా మండలంలోని 11 గ్రామ సచివాలయాలను ఆరు క్లస్టర్లుగా విభజించారు. తాటిపాడు, 80బన్నూరు గ్రామ సచివాలయాలు కలిపి ఓ క్లస్టర్‌గా, అలాగే జూపాడుబంగ్లా-1, 2 సచివాలయాలు, మండ్లెం-1, 2 సచివాలయాలు, పారుమంచాల, తరిగోపుల సచివాలయాలు, తంగడంచె, తర్తూరు సచివాలయాలను ఒక్కో క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. తూడిచెర్ల గ్రామ సచివాలయాన్ని ప్రత్యేక క్లస్టర్‌గా విభజించారు. సచివాలయాలను క్లస్టర్లుగా విభజించి వాటిలోని సిబ్బందిని తగ్గించనున్నట్లు సమాచారం. క్లస్టర్లుగా విభజించిన సచివాలయాల్లో సర్వేయర్, వెటర్నరీ అసిస్టెంటు, అగ్రికల్చర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ఉంటారు. మిగిలిన సచివాలయ ఉద్యోగులను ఆయా శాఖల్లో నియమించనున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే క్లస్టర్ సచివాలయాల్లో నియమించబడే ఉద్యోగులు గ్రామీణ ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించే అవకాశాలు తగ్గిపోనున్నాయి. సకాలంలో పనులు జరగక, పలురకాల ధ్రువీకరణ పత్రాలు అందక ప్రజలు సచివాలయ ఉద్యోగుల కోసం పడిగాపులు కాయటంతోపాటు తీవ్ర ఇబ్బందులకు గురవ్వాల్సి ఉంటుంది.

మేలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు

గ్రామాల్లోని జనాభా ప్రాతిపదికన సచివాలయాల్లోని ఉద్యోగులను కుదించి ఒక్కో సచివాలయంలో ఆరు నుంచి ఎనిమిది మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే జనరల్ కేటగిరీలో ఉద్యోగుల కుదింపు ప్రక్రియ పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెలాఖరు లేదా మే మొదటి వారంలో టెక్నికల్ కేటగిరీలతో పాటు మిగిలిన 11 కేటగిరీల ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసి వెంటనే బదిలీల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు సమాచారం. జనాభా ప్రాతిపదికన 6 నుంచి 8 మంది ఉద్యోగులను మాత్రమే ఉంచి మిగిలిన ఉద్యోగులను ఏ శాఖల్లో నియమిస్తారనే విషయమై స్పష్టత లేకపోవటంతో సచివాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

నేడు వేలంపాట

కొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన పార్వతీ దేవి సమేత తాండవ మల్లేశ్వరస్వామి దేవస్థానం, ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించిన భూముల కౌలు హక్కులకు సోమవారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ కార్తీక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు ఆలయాలకు సంబంధించి మొత్తం 58 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు సాగు చేసుకునేందుకు వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన రైతులు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

పాములపాడు: బడుగు బలహీన వర్గాల అభివృద్ధే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయమని కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల భాస్కర్ అన్నారు. ఆదివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్ఐ చర్చి ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితంపై కళారూప ప్రదర్శన చేశారు. అంబేడ్కర్ సమాజంలో ఎదుర్కొన్న అంటరానితనం, అసమానతలు, విద్యావంతుడుగా ఎదిగిన తీరు, బడుగు బలహీన వర్గాల కోసం చేసిన కృషిని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అభ్యుదయ అకాడమి ఆర్ట్స్ టీం మేనేజర్ ప్రశాంత్, కెప్టెన్ సురేష్, వైస్ కెప్టెన్ దివ్యతో పాటు కళాకారులు పాల్గొన్నారు.

మహానందిలో సండే సందడి



చిన్న కోనేరులో భక్తుల కోలాహలం

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పాఠశాలలకు సెలవులు ఉండటంతో రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లతో పాటు శ్రీ కోదండ రాములు, ఆంజనేయస్వామి, వినాయకనందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. భక్తులరద్దీ పెరగడంతో ఆలయ అధికారులు నిరంతర దర్శనం ఏర్పాటు చేశారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సవం..

శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వార్లకు ఆదివారం కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి వేదయుక్తంగా కల్యాణ క్రతువును ముగించారు. భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

నాటుసారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు

- 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసిన పోలీసులు
- 30 లీటర్ల నాటు సారా సీజ్



బెల్లం ద్రావణాన్ని పారబోస్తున్న పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని నీలిషికారిపేటలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌ను టౌన్ సీఐ, పోలీసులు నిర్వహించారు. 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 30 లీటర్ల నాటు సారా సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేసినట్లైతే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేద రోగులకు ఉచిత వైద్యం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నందికొట్కూరు: పేద రోగులకు ఉచితంగా వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎస్ఐ డీనరీ చైర్మన్ శామ్యూల్ రత్నరాజ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టౌన్ సీఎస్ఐ చర్చి ఆవరణలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. రోగులకు వైద్యులు రాజేష్‌కుమార్, వసీమ్ హసన్ రాజా, సౌజన్య, మధుసూదన్‌రావు, సోనీ ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత మెడికల్ క్యాంపును పేద రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. సీఎస్ఐ టౌన్ చర్చి సెక్రటరీ జాన్ క్రిసోస్టమ్, కోశాధికారి జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో కార్డెన్ సెర్చ్



అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేస్తున్న పోలీసులు




సోదాలు చేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

ఆత్మకూరు: పట్టణంలోని ఏబీఎం పాలెం, రంగం హాల్, కొత్తపల్లి రస్తా, కొట్టాల చెరువు ప్రదేశాల్లో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఏబీఎం పాలెంలో పీట్ల లక్ష్మమ్మ ఇంట్లో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని సీఐ రాము తెలిపారు. మహిళపై కేసు నమోదు చేశామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మాపురంలో..

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురంలో ఆదివారం తెల్లవారుజామున నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎస్ఐ చంద్రశేఖర్ స్పెషల్ పార్టీ బలగాలతో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. గ్రామంలోని పలు కాలనీల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. అనంతరం రూరల్ సీఐ గ్రామస్తులతో మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. తగాదాలు పెట్టుకుని చట్టాన్ని అతిక్రమించరాదని, భూ సమస్యలు, అప్పు లావాదేవీలు, ఇతర వివాదాలను న్యాయస్థానాన్ని ఆశ్రయించి పరిష్కరించుకోవాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు, స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన పహల్గాం మృతులకు సున్నిపెంటలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ముస్లిం మైనారిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలి



కొత్తసిద్దేశ్వరం చెంచులతో కలిసి మాట్లాడుతున్న నాగరాజు

జూపాడుబంగ్లా: కలెక్టర్ ఆదేశించినా రామసముద్రం మజారా గ్రామమైన కొత్తసిద్దేశ్వరం గ్రామాన్ని సందర్శించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కొత్త సిద్దేశ్వరం గ్రామాన్ని సందర్శించి చెంచులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్తసిద్దేశ్వరంలో చెంచులు నివశించేందుకు పక్కాగృహాలు, వీధిదీపాలు, తాగునీటి సౌకర్యం లేవని, దీనిపై నాలుగు నెలల క్రితం ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమ పరిధిలో లేదని బదులిచ్చారన్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ రాజకుమారి దృష్టికి తీసుకెళ్లగా కొత్తసిద్దేశ్వరంలో చెంచులను ఐటీడీఏలో చేర్చి, మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించినట్లు చెప్పారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, వారిపై చర్యలు తీసుకొని గ్రామంలోని చెంచులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

మద్యం విక్రేతపై కేసు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో వచ్చిన సమాచారం మేరకు చంద్రశేఖర్ గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా 18 మద్యం బాటిళ్లు లభించినట్లు వెల్లడించారు. నిందితుడిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్తంభం సరే.. తీగల మాటేమిటి?

ఆత్మకూరు: పట్టణంలోని వీరభద్ర కాలనీలో విద్యుత్ స్తంభాలు వేసి ఐదేళ్లయినా తీగలు లాగడంలో విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, కార్యదర్శి షేక్‌ఇస్మాయిల్ అన్నారు. ఆదివారం కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం కాలనీవాసులు చందాలు వేసుకుని ఐరన్ స్తంభాలను ఏర్పాటు చేసుకున్నా.. తీగలు లాగకుండా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు మోహన్, షాకీర్, కాలనీవాసులు ముర్తుజా, సర్దార్, జాకీర్, వలి పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మహానంది: గత జీవితాన్ని వదిలిపెట్టి సత్ప్రవర్తనతో మెలగాలని మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆదివారం పోలీస్ స్టేషన్ వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచామన్నారు. ఎవరైనా గ్రామాల్లో ప్రజలను బెదిరించినా, ఘర్షణలను ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఏఎస్ఐ మౌలాలి, హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞానం వైపు ప్రయాణించాలి

ఆత్మకూరు: పౌర్ణమి అనేది పూర్ణ దైవ జ్ఞానంకు గుర్తు అని, అలాగే అమావాస్య అనేది అజ్ఞానంకు గుర్తుగా ఉందని, కాబట్టి అజ్ఞానం నుంచి వెలుగు వైపు దైవ జ్ఞానంవైపు ప్రయాణించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ, ఆత్మకూరు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం వెంకటాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేపట్టారు. గ్రామస్తులకు 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించారు. వెంకటేశ్వర్లు, మునిదాసు, పుల్లారెడ్డి, సంజీవ, కుమారాచారి, చక్రపాణి పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు చేయించుకోవాలి

పాములపాడు: రైతులు తమ పొలాల్లోని మట్టిని పరీక్ష చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా మట్టి పరీక్షలు చేయిస్తోందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు తమ పొలానికి వచ్చి మట్టి నమూనాలు సేకరించి నంద్యాల మట్టి పరీక్షా కేంద్రానికి పంపడం జరుగుతుందని వివరించారు. పరీక్షలు చేయించడం వల్ల పొలంలో ఉన్న సమస్యలు, పోషకాల లభ్యత గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. తదనుగుణంగా ఎరువులు వాడవచ్చని వివరించారు.

- **జూపాడుబంగ్లా:** ఖరీఫ్ పంటలు సాగు చేసుకోవడానికి ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి 15.50 హెక్టార్లకు ఓ భూసార పరీక్ష చొప్పున మండలంలోని 11 రైతు సేవా కేంద్రాల పరిధిలో 700 మంది రైతుల పొలాల్లో మట్టి శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపించాల్సి ఉందన్నారు. మే 15లోగా రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఫలితాలను బట్టి నేలలో ఏ పంట వేసుకోవటానికి అనుకూలంగా ఉంటుందో, ఎంత నిష్పత్తిలో రసాయనిక ఎరువులతోపాటు సూక్ష్మపోషకాలు వినియోగించుకోవాలనే విషయం అవగతం అవుతుందన్నారు.



బైరవాణిచెరువులో తెల్లకలువలు

అందాల తెల్ల కలువ..

మహానంది: కలువ పూలంటే అందరికీ ఇష్టమే. ఎర్రటి, తెల్లటి కలువలు కొలనుల్లో కనువిందు చేస్తుంటాయి. సాధారణంగా ఎర్రటి కలువలు ఎక్కువగా కనిపిస్తాయి. గోపవరంలోని బైరవాణి చెరువులో తెల్ల కలువ పూలు చెరువు నిండా వికసించాయి. గ్రామస్తులు తీసుకెళ్లి పూజల్లో వినియోగిసున్నారు.

అరగంటకోమారు పవర్‌కట్

జూపాడుబంగ్లా: ఆదివారం కుటుంబసభ్యులతో సరదాగా ఉందామనుకొంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు 20 మార్లు విద్యుత్ కోతలు ఏర్పడటంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 80 బన్నూరు ఫీడర్ కింద విధులు నిర్వహించే ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్య వైఖరి, ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం వల్ల రెండు రోజుల నుంచి అరగంటకోమారు చొప్పున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతలపై సబ్‌స్టేషన్ అధికారులను వివరణ కోరగా 80బన్నూరు ఫీడర్ బ్రేక్‌డౌన్ కావడమే కారణమని పేర్కొంటున్నారు. ఎందుకు బ్రేక్‌డౌన్ అవుతుందనే విషయంపై స్పష్టమైన సమాధానం తెలియజేయకపోవటం గమనార్హం. జూపాడుబంగ్లా విద్యుత్ ఉపకేంద్రంలో ఏఈ పోస్టు ఖాళీగా ఉండటమే దీనికి కారణమని స్పష్టమవుతుంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని పవర్‌కట్‌లు లేకుండా చూడాలని, లేకపోతే ఆందోళన చేపడ్తామని వినియోగదారులు పేర్కొంటున్నారు.

ఉండి ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కొత్తపల్లి: ఉండి నియోజకవర్గంలోని రాజపాలెం అల్లూరి సీతారామరాజు కాలనీలో గుడిసెల కూలి ్చవేతను అడ్డుకొని పేదలకు అండగా నిలిచిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు డిప్యూటీ స్పీకర్ పదవికి పనికి రాడని సీపీఎం మండల కార్యదర్శి స్వాములు, సీనియర్ నాయకుడు సంజీవరాయుడు విమర్శించారు. ఆదివారం మండలంలోని సింగరాజు పల్లి గ్రామంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రఘురామ కృష్ణంరాజు తన నియోజకవర్గంలో దాదాపు వెయ్యి మంది పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసి వారిని రోడ్డున పడేశారన్నారు. సీపీఎం బృందం బాధితులకు పరామర్శించి అండగా నిలిస్తే సహించలేక అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. పూటకొక పార్టీ మార్చి బ్యాంకులకు వందల కోట్లు ఎగ్గొట్టి కేసులను ఎదుర్కొంటున్న వ్యక్తి రఘురామ కృష్ణంరాజు అని విమర్శించారు. ఆయన్ను వెంటనే ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఎం దాసు, పి ఏసన్న, జి దాసు, తదితరులు పాల్గొన్నారు.



తర్తూరులో పేరుకుపోయిన చెత్తాచెదారం

జాతర ముగిసింది.. చెత్త మిగిలింది

జూపాడుబంగ్లా: తర్తూరు జాతర ముగియడంతో ఆ ప్రాంతంల్లో దుకాణాల నుంచి ఏర్పడిన చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి దోమలు వ్యాపిస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 12 నుంచి ప్రారంభమైన తర్తూరు జాతర పది రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగింది. జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించటంతో ఆ ప్రాంతంలో చెత్తాచెదారం కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. వర్షానికి కుళ్లి దుర్వాసన వెదజల్లుతుండటంతో పాటు దోమలు వ్యాపిస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని చెత్తచెదారాన్ని తొలగించడంతో పాటు దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అన్నదాత కుదేలు



లింగాపురంలో జలమయమైన ప్రధాన రహదారి

బండి ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో ఆదివారం గాలి వానతో కూడిన వర్షం కురవడంతో అన్నదాతకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆదివారం ఉదయం 11.30 సమయంలో ఆకాశం మేఘావృతమై ఉరుములు , మెరుపులు, గాలితో కూడిన వర్షం 15 నిమిషాలు కురిసింది. లింగాపురం, జి.సి.పాలెం, నారాయణపురం, చిన్న దేవళాపురం గ్రామాల్లో వరి కోతలు సాగుతుండగా, ఇప్పటికే కోతలు పూర్తయిన వారు ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకున్నారు. మరికొందరు సంచుల్లో నిల్వ చేసుకున్నారు. వర్షంతో కల్లాల్లోకి నీరు చేరి ధాన్యం తడిసిపోయింది. చేతికొచ్చిన పంట కళ్ల ముందే తడిసిపోతుంటే కాపాడుకునేందుకు అవస్థలు పడినా లాభం లేకపోయింది. కొన్ని చోట్ల వరి పైరు నేలవాలడంతో గింజలు రాలిపోయాయి. ధాన్యం ఇంటికొస్తాయనుకుంటే ఇలా అయ్యిందని అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.